వారు భిన్నకాలములందు భిన్నమతము లవలంబించిరి. వీరిలో వీరికి స్పర్ధలు మతభేదములచేత బెఱిగినవి. కొందఱు వైదికమతమును, కొందఱు శైవశాక్తేయాదిమతములను; మఱి కొందఱు జైన బౌద్ధమతములను, ఈమతముల వారే యిటీవలకాలమున వైష్ణవమతములను, వైదికమతములనవలంబించియాయామతముల నధమావస్థనుండి యుత్తమావస్థకుఁ దెచ్చి దేశముయొక్కయు, సంఘములయొక్కయుఁ బురోభివృద్ధికిని, నాగరికతాభివృద్ధికిని, రసజ్ఞతాభివృద్ధికిని నెంతోతోడ్పడిరి. సంఘములలో పరస్పరస్పర్ధలవలన తత్త్వజిజ్ఞాస బలపడి శాఖోపశాఖలతో విస్తరించినది. మనము వీని తత్త్వమునంతయు సహానబుద్ధిగలిగి గ్రహించినఁగాని వారికివారికి నుండు భేదములసంప్రదాయ చరిత్రములు బోధపడవు. వానిం దెలిసికొన్నఁగాని మనలో మన కైకమత్యము కలుగఁజాలదు.

# కాకమ్మ

మునిమాణిక్యం నరసింహారావు గారు, బి. ఏ., (సాహితీసమితిసభ్యుఁడు)

వరలక్ష్మి మాటలు వరహాల మూట
కన్నతల్లి చూపు కనకాల మెఱుపు
బుల్లెమ్మ నిలువెల్ల బంగారు కొండ
బువ్వానూ తినవమ్మ బొజ్జ నిండాను!
మామయ్య తెస్తాడు మల్లె మొగ్గల్లు
అత్తయ్య తెస్తుంది ముత్యాల పేరు
బాబాయి తెస్తాడు బంతి పువ్వుల్లు
పట్టుకువచ్చా జెల్లో పెట్టుకో వచ్చు.
కాకమ్మ, కాకమ్మ, గంతేసి చెప్పు!
వరలక్ష్మి మామయ్య వస్తాడ రాడ
తెల్లటి పరికీణ తెస్తాడ తేడ?

* * * *

మావూరు నుంచిమా మామయ్య వస్తె
తెల్లటి పరికీణ నే కట్టుకొంటూ.
అక్కయ్యతోఁగూడ నేనాడు కొంటూ,
కాకమ్మ కాళ్లకు గజ్జ గట్టిస్తా.
గజ్జ ఘల్లుమనగ గంతేసి చెప్పు,
కాకమ్మ నీబిడ్డ కుగ్గు పోయిస్తా!
కాలెత్తి ఘల్లున గంతొక్క టెయ్యి!
వరహాల గంతునీ వొక్కటీ వేస్తే
ఘల్లున నీవొక్క గంతూను వేస్తే
వరలక్ష్మి మోమున వెన్నెలా గాయు
మెల్లగా నవ్వితే ముత్యాలు గారు
కిలికిల నవ్వితే కెంపులు జారు
పకపక నవ్వితే పగడాల తీరు.

* * * *

తోలకే కాకిని తోడుగా నేను
గంతూకు వంతుగా గంతు వేస్తాను;
కాళ్లను గజ్జెలు ఘల్లు మంటాయి
అమ్మకు వళ్లంతా ఝల్లు మంటుంది.